శిథిలావస్థలో తిలారు గేటు రహదారి

- ప్రయాణికుల అవస్థలు

విశాలాంధ్ర - జలుమూరు: జలుమూరు మండలం తిలారు రైల్వే గేట్ సమీపంలో నిర్మాణం జరుగుతున్న ఫ్లైఓవర్ వంతెన నిర్మాణంతో ప్రక్కనున్న రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ రహదారిపై ప్రయాణం అంటే ప్రయాణికులకు నరకంలా ఉందని పలువురు వాపోతున్నారు. గత ఆరు నెలల నుండి ఈ రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని పలువురు ప్రయాణికులు బాహాటంగా విమర్శిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే ఈ గోతులు నీటితో నిండి ద్విచక్ర వాహన ప్రయాణానికి ఇబ్బంది కలుగుతుందని కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోయారు.

ఉచిత యోగా శిక్షణను వినియోగించుకోండి

- రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్ మోహనరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర గవర్నర్ మంజీర జిలాని సూచనల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారి సహకారంతో శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పరిపాలన విభాగంలో ఉచిత యోగ శిక్షణా తరగతులను ప్రారంభించామని రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వర రావు అన్నారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ పి.జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ యోగ గురువు రామారావు పర్యవేక్షణలో, యోగ శిక్షకురాలు ఎం.గాయత్రీ తరగతులను నిర్వహిస్తారని, ఈ రోజు మహిళల యోగా తరగతులు ప్రారంభించగా, అతి త్వరలో పురుషుల యోగా తరగతులను సైతం నిర్వహిస్తామన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగాతో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఉచిత యోగ కొరకు యోగ

శిక్షకురాలు ఎం.గాయత్రీ చరవాణిని (94930 43999) సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యోగా గురువు రామారావు, రెడ్ క్రాస్ కోశాధికారి కనుగుల దుర్గ శ్రీనివాస్, వైకుంఠ రావు, బి.సతీష్, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రసాద్ రావు, స్వీప్ రమణమూర్తి, కళ్యాణ్, నరసింగరావు, వెంకీ చైతన్య, గొలివి రమణ, గుణాకర్‌రావు, చిన్మయరావు, సుజాత, నంది ఉమా శంకర్, అయేషా బేగం, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి: ఎస్పీ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు పెరేడ్‌ను పరిశీలించారు. తొలుత సాయుధ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించి పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే మెరుగైన సేవలందించ గలమని చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి సిబ్బంది నుంచి వ్యక్తిగత, వృత్తిరీత్యా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్‌ఐ కె.నర్సింగరావు, ఎస్‌ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణనకు శ్రీకారం....

- దీపావళి నుంచి మూడు సిలిండర్లు
- జనవరిలో అమ్మకు వందనం కోసం ప్రణాళిక
- మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - టెక్కలి/కోటబొమ్మాళి: 21వ అఖిల భారత పశు గణనలో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుం బాలకు చెందిన పశువుల వివరాలను నమోదు చేయనున్నట్లు వ్యవసాయ, పశుసంవర్ధక, సహకార, మత్స్య శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలం పెద్ద బమ్మిడిలో శుక్రవారం పశు గణనను శాఖ మంత్రిగా ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గణనలో వ్యవసాయ పరికరాల వివరాలనూ సేకరిస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పశు సంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17,244 గ్రామాలు, పట్టణాల్లోని 3,929 వార్డుల్లో గృహ, గృహేతర వ్యక్తుల నుంచి వివరాలు తీసుకుంటారని, ఇందుకోసం 5,390 మంది సిబ్బంది, 1,237 మంది పర్యవేక్షకులు, 45 మంది స్క్రూటినీ అధికారులు, ఇతర సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారని వివరించారు. వీరికి ట్రావెలింగ్ కిట్లు, 60వేల వాల్‌పోస్టర్లు, 1.50కోట్ల గృహస్టిక్కర్లు, 8వేల ఐడీ కార్డులు అందించామని పేర్కొన్నారు. పశుగణన పూర్తయిన ఇంటి తలుపుపై స్టిక్కర్ వేస్తామని అన్నారు. ఈ దీపావళి నుంచి ఏటా మూడు సిలిండర్లు ప్రతి నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఇస్తున్నామని ప్రకటించారు. అమ్మకు వందనం జనవరి నెలలో ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆ దిశగా కృషి చేస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా వీలైనంత త్వరగా ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మురళీధర్, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.జైరాజ్, జిల్లా జనాభా లెక్కల నోడల్ అధికారి డాక్టర్ జి. నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.లోకనాథం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.ప్రజ్ఞాచైతన్య, పశుసంవర్ధక సహాయకుడు, సెన్సస్ ఎన్యుమరేటర్ ఎం.బలరాం, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, వెలమ విజయలక్ష్మి, పూజారి శైలజ, మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల మహాసభకు తరలిరండి

విశాలాంధ్ర - సోంపేట: విజయవాడ ధర్నా చౌక్ సెంటర్‌లో ఈ నెల 28 సోమవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అగ్రిగోల్డ్ బాధితుల మహాసభకు బాధితులంతా తరలి రావాలని అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి పుక్కళ్ల అరేలమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్ష కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అగ్రిగోల్డ్ బాధితులు తీవ్ర అన్యాయానికి గురైనప్పటికి ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో న్యాయం చేయక లక్షలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని అరేలమ్మ పేర్కొన్నారు. ఈ సభ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గల అగ్రిగోల్డ్ బాధితులంతా పెద్దసంఖ్యలో విజయవాడ మహాసభకు హాజరు కావాలని కోరారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలోని పోలీసు కమ్యూనిటీ హాల్లో శుక్రవారం పోలీసు సిబ్బందికి, వారి పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలను, బహుమతులను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

పశుషోషణ కీలక ఆర్థిక వనరు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: గ్రామీణ భారతదేశంలో పశువుల పెంపకం జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొందు శంకర్ అన్నారు. కిష్టప్పపేటలో పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పశు పోషణ అదనపు ఆదాయాన్ని అందిస్తుందని తెలిపారు. అనేక భూమిలేని కుటుంబాలకు ప్రాథమిక జీవనోపాధిగా పని చేస్తుందని, పశు పోషణ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయాల్లో గ్రామీణ ప్రాంతాలలో కీలకమైన ఆదాయ వనరుగా ఉంటుందని తెలిపారు. 21వ పశు గణన మన రాష్ట్రంలో నిర్వహించడానికి వాల్ పోస్టర్లు, గృహ స్టిక్కర్లు, ఐడీ కార్డులతో సహా కీలకమైన మెటీరియల్ ను పశు గణన కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూసేందుకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సహాయ సంచాల కులు డా. పి.ఎస్.జి.బాలకృష్ణ, సహాయ సంచాలకులు విపిసి వై.విక్రుష్ణారావు, స్థానిక పశువైద్యాధికారి తిరుపతి రావు, అరసవల్లి, కళింగపట్నం పశువైద్యాధికారులు డా. దిలీప్, జ్యోత్స్న, పశు సంవర్ధక సహాయ సిబ్బంది అజిత్, మోహన్, అర్జున్, మధు స్థానిక సర్పంచ్ అరసవల్లి సత్యవతి పాల్గొన్నారు.

అయోడిన్ అవగాహన వారోత్సవాలు

విశాలాంధ్ర - పలాస: మనం నిత్యం వాడే ఉప్పులో అయోడిన్ ఉండాలని తద్వారా థైరాయిడ్‌ను నివారించవచ్చని బ్రాహ్మణతర్లా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌వి రమణారావు అన్నారు. అయోడిన్ రుగ్మతల లోప నివారణ వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం వక్తలు ప్రసంగిస్తూ అయోడిన్ ఒక సూక్ష్మ పోషకమని ఇది థైరాయిడ్ గ్రంధి పనితీరును మెరుగు పరుస్తుందన్నారు. దీని లోపం వలన మెదడు ఎదుగుదల జ్ఞాపకశక్తి మందగిస్తుందని, గాయిటర్ వ్యాధి వస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఈశ్వరరావు, మధుబాబు, కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధన రావు, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, మెహర్ సుధా, కిషోర్, రజని కుమారి, జ్యోతమ్మ, అరుణకుమారి, క్రిష్ణ వేణి, చిన్నారావు, లక్ష్మి భాయి, విష్ణాచారి, రవితేజ, కోటేశ్వరరావు, తులసీరాణి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, అప్పుడే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకుంటామని సంతబొమ్మాళి ఎస్సై సింహాచలం సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ఉపయోగంపై శుక్రవారం బోరుభద్ర కూడలిలో వాహనదారులుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవడానికి హెల్మెట్ చాలా అవసరమన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని చెప్పారు. హెల్మెట్ ధరించని వారిపై తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ప్రతీ ఒక్కరు వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లు వెంట ఉంచుకో వాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

సామాజిక సమస్యలపై అవగాహన

విశాలాంధ్ర-కంచిలి: విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా కంచిలిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కవిటి మండలం డి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారులు బాలక లోకనాథం కళాత్మక ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఏకపాత్రాభినయంతో బాల్య వివాహాలు పర్యావరణ పరిరక్షణ, విద్య ఆవశ్యకత, సెల్‌ఫోన్ సమస్యలు, రోడ్డుభద్రత, తదితర అంశాలపై కళాప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు ఈ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది, అనంతరం లోకనాథంను పాఠశాల యాజమాన్యం సన్మానించింది. ప్రధానోపాధ్యాయుల తోపాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన

విశాలాంధ్ర - రణస్థలం: రణస్థలంలో శనివారం నుండి మొదలుకాబోయే టీడీపీ సభ్యత్వ నమోదుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విజయనగరం పార్లమెంట్ సభ్యులు, ఐటీ అండ్ కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పల నాయుడు మాట్లాడుతూ టీడీపీ అంటే తెలుగు జాతి ప్రగతి అని, తెలుగువారి భవిష్యత్తు అని అటువంటి చారిత్రాత్మక పార్టీలో చేరేందుకు ఎదురు చూస్తున్న మీకోసం సభ్యత్వ నమోదు కార్యక్రమం-2024 శనివారం నుండి ప్రారంభం కాబోతుందన్నారు. సభ్యత్వ నమోదు చేసుకోవడం ద్వారా టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అందిస్తుందన్నారు. గతంలో ఈ బీమా సౌకర్యం 2 లక్షలకు మాత్రమే ఉండేదని, నేడు 5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం కీలకం

అంబేద్కర్ వర్శిటీ బీసీడీఈ సమన్వయకర్త ప్రొ. అజయ్‌కుమార్

విశాలాంధ్ర - నరసన్నపేట: దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని అంబేద్కర్ యూనివర్శిటీ బీసీడీఈ సమన్వయకర్త ప్రొఫెసర్ బి.అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి బీసీడీఈ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్), అంబేద్కర్ యూనివర్శిటీ సంయుక్తంగా పద్మావతి డిగ్రీ కళాశాలలో లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం)పై విద్యార్థులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వల్ల సామాజిక సేవ మెరుగ్గా జరుగుతుందని, విద్యార్థులు తలుచుకుంటే దేశం ప్రగతి పథంలోకి వెళ్ళటం తథ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదవటం, రాయటం తదితర సామర్థ్యాలను పెంచేలా ప్రణాళిక రూపొందించామని ఇటువంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, సీహెచ్.దుర్గాప్రసాద్, కళాశాల అకడమిక్ ఇన్‌చార్జ్ ఎం.శ్రీనివాసరావు, బీసీడీఈ కో-ఆర్డినేటర్, కె.రాము పాల్గొన్నారు.

దాతల దాతృత్వంతో సగం ధరకే ఆశ్రమానికి స్థలం

విశాలాంధ్ర - పోలాకి: ఎంతో దాతృత్వం కలిగిన దాతలు ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన ఆశ్రమానికి సగం ధరకే స్థలం ఇస్తున్నట్లు శ్రీ రామయోగి సేవా ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు బమ్మిడి విశ్వనాథం చెప్పారు. శుక్రవారం బెలమర జంక్షన్‌లో ఎంతో ప్రజాధరణ పొందుతున్నట్లు తెలిపారు. శ్రీ రామయోగి సేవాశ్రమం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహణ కోసం స్థలం అవసరం కలిగియుండడంతో దాతలు ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఆశ్రమం పరిధిలోగల సుమారు 18 సెంట్లు స్థలమును స్థానికంగా ఉన్న రేటు కంటే సగం రేటుకే ఆశ్రమం అభివృద్ధి కొరకు దాతలు ఇచ్చినట్లు చెప్పారు. ఎంతో విలువైన స్థలాన్ని జామి వాసుదేవ రావు, జామి మోహనరావు, జామి మహేశ్వర రావు, లాడి శ్రీరామ్మూర్తి వంటి దాతలు ఇటువంటి స్థలాన్ని సగం ధరకు ఇవ్వడం పట్ల స్థానికులు దాతలను అభినందించారు. కార్యక్రమంలో దాతలతో పాటు ఆశ్రమం నిర్వాహకులు లక్ష్మణరావు, గాతలవలస ఎంపీటీసీ ప్రతినిధి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాజులు నాటి రంగసాగరం పరిశీలన

విశాలాంధ్ర - జలుమూరు: కాలగర్భంలో కలిసిపోతున్న రాజులనాటి రంగసాగరం అనే శీర్షిక విశాలాంధ్రలో ప్రచురణ కావడంతో జిల్లా ఇరిగేషన్ అధికారి ఆదేశాల మేరకు సారవకోట మండల తహశీల్దార్ కే.విజయలక్ష్మి, ఇరిగేషన్ అధికారులు సర్వేయర్ రామకృష్ణ, స్థానిక రెవెన్యూ అధికారి ఇతరులు రంగసాగరాన్ని పరిశీలించారు. దీనిపై సమిష్టిగా నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కత్తిరి వెంకటరమణకు మంత్రి అభినందన

విశాలాంధ్ర - జలుమూరు: సారవకోట మండల టీడీపీ అధ్యక్షులు కత్తిరి వెంకట రమణను రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఎన్నికల ముందు టీడీపీ సోషల్ మీడియాలో ప్రతిభకు రాష్ట్ర మొదట ర్యాంక్ మన టిడిపి అఫీషియల్ యాప్ స్టేట్‌లో ఏడవ ర్యాంకు పొందడం అభినంద నీయమన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నరసన్న పేట ఇన్‌చార్జ్ ప్రస్తుత శాసనసభ్యుల బగ్గు రమణ మూర్తి ఆదేశాల మేరకు బాదుడే బాదుడు, ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి బాబుని మళ్లీ రప్పిద్దాం అనేక కార్యక్రమాలు చేసిన ఆయనకు మంత్రి అభినందించారు.

ప్రారంభమైన పశుగణన

విశాలాంధ్ర - కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ పంచాయతీ పరిధిలో 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమం శుక్రవారం పశువైద్యాధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌ఏ నీలవేణి మాట్లాడుతూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమం చేపడుతున్నట్లు

తెలిపారు. ఈ పశుగణన కార్యక్రమంలో గ్రామాల్లో ఉన్న గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు, గుర్రాలు, కోళ్లు, పలు రకాల పక్షులు, 16 రకాల పెంపుడు జంతువులు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పొందల కృష్ణారావు, వీఆర్వో బాలకృష్ణ, రైతులు నారాయణమూర్తి, ప్రవీణ్, గిరి, బాలయ్య, షణ్ముఖనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

విశాలాంధ్ర - నరసన్నపేట: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మరుగుదొడ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలో మడపాం, కోమర్తి అంగన్వాడీ కేంద్రాలను, పట్టణంలో బండివీధి, పెద్దపేట, హడ్కో కాలనీ, కుమ్మరిపేటలోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె నిర్మాణం చేస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. అలాగే కేంద్రంలో వున్న చిన్నారులతో మాట్లాడి, పౌష్టికాహారం అందుతున్న తీరును

అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించాలని, నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ నాగలక్ష్మీ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పశు గణన గోడ పత్రిక విడుదల

విశాలాంధ్ర - ఆమదాలవలస: 21వ అఖిలభారత పశు గణన వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరుగుతుందని సహాయ సంచాలకులు, సబ్ డివిజనల్ సెన్సస్ ఆఫీసర్ డాక్టర్ రోణంకి ఆనందరావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆయన విడుదల చేశారు. విషయ సేకరణదారులు గృహ సందర్శనకు వచ్చిన సమయంలో తమ వద్ద ఉన్న పశువులు, కోళ్ళ సంఖ్యపై సరైన సమాచారాన్ని వారికి అందించాలన్నారు. పశు

గణనలో భాగంగా, గణన ప్రక్రియ పూర్తయినట్లు గుర్తుగా ప్రతి ఇంటి ముందు తలుపు యొక్క కుడి ఎగువ మూలలో స్టిక్కర్లు ఉంచుతారని తెలిపారు. పశు సంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించిన కార్యక్రమాల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ కోసం అవసరమైన సమాచారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, టీడీపీ నాయకులు తమ్మినేని విద్యా సాగర్, పి.వి.వి.కె.రాజు, మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి లక్ష్మణరావు, గురుగుబెల్లి నాగే శ్వరరావు, పురపాలక సంఘం, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల పెంపకంలో అప్రమత్తంగా ఉండాలి

- కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - ఆమదాలవలస: చేపల పెంపకంలో వాతావరణ ప్రభావంతో ఆధారపడి ఉంటున్నందున పెంపకందారు అప్రమత్తంగా ఉండడం ముఖ్యమని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కే.భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస సంయుక్తంగా స్వదేశీ మత్స్యకార సహకార సంఘ సభ్యులకు వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ సహజ మంచి నీటి వనరులలో చేపల దిగుబడికి నేల, నీరు గుణాల యాజమాన్యం చాలా కీలకమని, రైతులు చేప పిల్లల పెంపకం చేపట్టడంలో నూతన పద్ధతులను ఆచరించి ఆదాయ మార్గాలను ఏర్పరచు కోవచ్చని వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో చేపలకు వచ్చే వ్యాధులను నివారించు కోవడానికి సూచనలు చేసి శిక్షణల ద్వారా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని స్వదేశీ

మత్స్యకార సహకార సంఘ సభ్యులు మత్స్య సహాయకుడు భాస్కర్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జీఎస్ రాయ్, సునీత, హరికుమార్, కిరణ్ అనూషాలు పాల్గొన్నారు.

అంతర్జాలంపై వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలలో అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఈనాడు కోఆర్డినేటర్ బి.భాస్కర్ ఆధ్వర్యంలో 65 మంది విద్యార్థులకు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలలో ప్రథమ స్థానం చందు, ద్వితీయ స్థానం ప్రదీప్, తృతీయ స్థానంలో మదన్ కుమార్ కైవసం చేసు కున్నారు. గెలుపొందిన విద్యా ర్థులకు ప్రధానోపాధ్యాయులు డి.నాగభూషణ్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడి డిమాండ్లను సాధిద్దాం

ఎల్ఐసి ఏజెంట్ల సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర - సోంపేట : పలు డిమాండ్ల సాధన కోసం జీవిత బీమా ఏజెంట్లు అందరూ కలిసి ఐక్యంగా పోరాడుతూ డిమాండ్ల సాధనకు కృషి చేయాలని పలాస బ్రాంచ్ ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోంపేటలో శుక్రవారం జరిగిన ఏజెంట్ల సమావేశానికి హాజరైన సీనియర్ ఏజెంట్లు రాజేంద్రనాయుడు, కోదండరావు, ప్రకాశరావు, ఢిల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, చిన్నారావు తదితరులు మాట్లాడారు. అక్టోబర్ 1 నుంచి భారతీయ జీవిత బీమా సంస్థ అమలు చేస్తోన్న కొత్త విధానంలో అనేక అంశాలను అఖిల భారత ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ వ్యతిరేకిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే లక్ష రూపాయల పాలసీలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్న ఖాతాదారుల పాలసీలపై బోనస్ పెంచాలని పేర్కొన్నారు. ఏజెంట్లుకు కమిషన్ తగ్గించడం తీవ్రంగా పరిగణించారు. పెంచాల్సింది పోయి కమిషన్ తగ్గించడం దారుణమని అన్నారు. ఇంకా పలు సమస్యలపై వివరిస్తూ ఎల్ఐసి యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి లోపభూయిష్టంగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఎల్ఐసి వైఖరికి నిరసనగా నిలుపుదల చేసిన కొత్త వ్యాపారాన్ని వక్రమార్గాల్లో కొంత మంది డెవలప్మెంట్ ఆఫీసర్లు ఏజెంట్ల నిర్ణయానికి వ్యతిరేకంగా చేయడాన్ని తప్పుబట్టారు. పలాస, సోంపేట బ్రాంచ్‌లలో చోటు చేసుకున్న ఇటువంటి సంఘటనల్లో ఆయా డీఓల వైఖరిపై ఏజెంట్ల సమావేశం ముక్తకంఠంతో ఖండించింది. ఇటువంటి చర్యలు మళ్లీ పునరావృతం అయితే యూనియన్ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సోంపేట ఎల్ఐసి కార్యాలయం వద్ద డిమాండ్ల సాధనపై పెద్దసంఖ్యలో ఏజెంట్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్లు వసంతరావు, రామ్మూర్తి, వాసుదేవరావు, పద్మలోచన, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్వీజ మాసం నవమి శుక్రవారం

పాతపట్నం అమ్మవారు అలంకరణతో దర్శనం

విశాలాంధ్ర - జలుమూరు : పాతపట్నంలో కొలువైయున్న నీలమని అమ్మవారు ఆశ్వీజ మాసం నవమి శుక్రవారం అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చింది తెల్లవారుజాము నుండి అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూజలు చేపట్టారు పలు ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు అమ్మను దర్శించి ఆశీస్సులు అందుకున్నారు కార్య నిర్వహణ అధికారి టి.వాసుదేవరావు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

27న జీ తెలుగులో డబుల్ ఇస్మార్ట్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్‌ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ప్రీమియర్‌గా అందిస్తోందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన కథ, కథనంతో పాటు పూరీ జగన్నాథ్ డైరెక్షన్, రామ్ నట విశ్వరూపం తో డబుల్ ఇస్మార్ట్,ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కథ అంతర్జాతీయ మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్) చుట్టూ తిరుగుతుందన్నారు.అతని జ్ఞాపకశక్తిని మరొకరి మెదడుకు బదిలీ చేయడం వల్ల అతను అమరుడవుతాడని ఒక శాస్త్రవేత్త సూచించడంతో అందుకు సరిపోయే వ్యక్తి కోసం అన్వేషణ మొదలవుతుందన్నారు. ఆ అన్వేషణలో హైదరాబాద్ లోని శంకర్ (రామ్ పోతినేని)సరైన వ్యక్తిగా గుర్తించడంతో బిగ్ బుల్ మెమరీ ట్రాన్స్ ఫర్ జరుగుతుందన్నారు.ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయం తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే డబుల్ ఇస్మార్ట్ సినిమా చూడాల్సిందే అన్నారు. రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, గెటప్ శ్రీను, అలీ, షాయాజీ షిండే, ఝాన్సీ వంటి నటులు కీలక పాత్రలు పోషించారన్నారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ మాస్‌ఎంటర్టైనర్ని జీ తెలుగు వేదికగా ఈ నెల 27న మీరు తప్పకుండా చూడాలన్నారు.

ఎచ్చెర్లలో పోలీసు ఓపెన్ హౌస్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలోని కమ్యూనిటీ హాల్లో శుక్రవారం పోలీసు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో వినియోగించే సాంకేతిక పరికరాలు, కమ్యూనికేషన్, బాంబు డిటెక్షన్, డిస్పోజల్ సామగ్రి, వివిధ రకాల ఆయుధాలు, పోలీసు జాగిలాల పనితీరు, డ్రోన్స్ వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీ వార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్, స్పీడ్ గన్, నేరపరిశోధనలో, బాంబులు గుర్తించడంలో పోలీసు జాగిలాల పనితీరు తదితర వాటికి గురించి అవగాహన కల్పిస్తున్నట్లు డిఎస్పీ శేషాద్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు చెప్పారు..

రహదారిపై ఉన్న గోవులను గోశాలకు తరలింపు

విశాలాంధ్ర - టెక్కలి : మేజర్ పంచాయతీలో రహదారిపై తిరుగుతున్న గోవుల కోసం గురువారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గోశాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే శుక్రవారం రహదారులపై తిరుగుతున్న గోవులను పంచాయతీ కార్యదర్శి కేవివి జగన్నాథం గోశాలకు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పెంచుకుంటున్న గోవులను ఇంటివద్ద కట్టుకోవాలని, ఇకనుండి రహదారులపై గోవులు కనిపిస్తే గోశాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. ఒకవేళ తమ పెంచు కుంటున్న గోవులు గోసాలకు తరలించినట్లు అయితే తమ ఆధార్ కార్డు పట్టుకొని, అపరాధ రుసుము 1000/- రూపాయలు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

పర్యావరణ విశ్లేషణ ద్వారా మేలైన వ్యవసాయం

విశాలాంధ్ర - సోంపేట : వరి పంటలో పర్యావరణ విశ్లేషణ ద్వారా మేలైన వ్యవసాయం సాధ్యమవుతుందని మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి పేర్కొన్నారు. పొలంబడిలో భాగంగా పాత్రఖండ గ్రామంలో శుక్రవారం వరి ప్రదర్శన క్షేత్రాన్ని రైతులతో కలిసి వ్యవసాయాధికారులు, సిబ్బంది పరిశీలించారు. వాతావరణ పరిస్థితులు పంటలో మిత్ర పురుగులు, శత్రు పురుగులను విశ్లేషించే విధానాన్ని రైతులకు వివరించారు. పైరుపై ఆశించిన చీడపీడల నియంత్రణకు ఇటువంటి విశ్లేషణ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. పంటను పరిశీలించే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. సేంద్రీయ వ్యవసాయ చేసే రైతులు రానున్న వారాల్లో ధృవీకరణ విధి విధానాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పొలంబడి ద్వారా రైతులకు అధిక గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఉషా కుమారి, రైతులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో శుక్రవారం దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సోంపేటకు చెందిన మల్లా తిరుమలరావు, త్రివేణి దంపతులు రానున్న శీతాకాలం దృష్ట్యా వయోవృద్ధులకు అవసరమైన దుస్తులను అందజేశారు. నూతన భవనాల నిర్మాణం కొరకు అవసర మైన ఫ్లోర్ టైల్స్, అలాగే బోరుబావి, ఇన్వెర్టర్, బ్యాటరీ మొదలైన సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు గుల్ల రమేష్, మోహనరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.